క్లుప్తంగా

హుండీ ఆదాయం రూ.52 వేలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లె: స్థానిక అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపులో రూ.52,949 వేల ఆదాయం లభించినట్లు గ్రూప్ టెంపుల్స్ ఈఓ కమలాకర్ తెలిపారు. ఈ ఆదాయాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి గ్రామ సభలు రేపు

సదుం: మండలంలోని అన్ని పంచాయతీలలో శుక్రవారం ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాజశేఖర్‌బాబు తెలిపారు. 18 పంచాయతీల పరిధిలో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో సభలు జరుగుతాయన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులను గుర్తించి, ప్రణాళికలు రూపొందిస్తామని పేర్కొన్నారు. గ్రామస్తులు హాజరు కావాలని కోరారు. ఏపీఓ శివశంకర్ పాల్గొన్నారు.

నంది వాహనం బహూకరణ



నంది వాహనాన్ని బహూకరిస్తున్న దాతలు

పుంగనూరు: పట్టణంలోని ప్యాలెస్ ఆవరణలోని శ్రీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయానికి ఉత్సవ నంది వాహనాన్ని గురువారం బహూకరించారు. పట్టణానికి చెందిన దేశాది శ్రీనివాసులు, కల్పన, కిరణ్, జ్యోతి, వంశీకృష్ణ కలసి రూ.2లక్షలతో 40 కిలోల బరువు గల నంది ఉత్సవ వాహనాన్ని తయారు చేయించారు. ఆలయ అర్చకులు పూజలు చేసి, నంది వాహనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా దాతల కుటుంబసభ్యులకు వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదం అందించారు. సుకుమార్ బాబు, నానబాలగణేష్ పాల్గొన్నారు.

పలమనేరు అర్బన్ ఎస్‌ఐ స్వర్ణతేజ

పలమనేరు: పలమనేరు అర్బన్ ఎస్‌ఐగా స్వర్ణతేజ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె చిత్తూరు డీసీఆర్బీ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. పట్టణంలో శాంతిభద్రతలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్

శాంతిపురం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ప్రేమ్‌రాజ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వెదురుకుప్పం మండలం నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన మైథిలీ రెండు వారాల క్రితం బదిలీ కావడంతో ఆమె స్థానంలో ఏఓ హేమమాలిని ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు.

తీరిన తాగునీటి సమస్య



బోరులో పుష్కలంగా వస్తున్న నీరు

పలమనేరు: మండలంలోని జరావారిపల్లి పంచాయతీ దొడ్డిపల్లి ఎస్సీ, బీసీ కాలనీల్లో గత రెండేళ్లుగా గ్రామస్తులు తగినంత తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిసి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు స్పందించి జెడ్పీ నిధుల ద్వారా రూ.15లక్షలు మంజూరు చేశారు. దీంతో ఆగ్రామాల్లో స్థానిక సర్పంచ్ వనితకళ అక్కడ బోర్లను డ్రిల్ చేయించి మోటార్లను బిగించి గ్రామస్థులకు నీటి సమస్యను తీర్చారు. తమకు నిధులు మంజూరు చేసి ప్రజల నీటి సమస్యను తీర్చిన జెడ్పీ చైర్మన్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

గాలికుంటు టీకాలతో ఎన్నో ప్రయోజనాలు

ఐరాల: గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేయించడం వలన ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని మద్దిపట్లపల్లె పశు వైద్యాధికారి పినాకపాణి అన్నారు. మండలంలోని మద్దిపట్లపల్లె పశు వైద్యశాల పరిధిలో బుధవారం జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో పశువులకు టీకాలు వేసి ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నాలుగు నెలలకు పైబడిన 3,387 పశువులకు 20వ తేదీ నుంచి గురువారం వరకు ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలు వేసినట్లు చెప్పారు. ఈ గాలికుంటు వ్యాధి వలన పశువుల్లో పాల దిగుబడి గణనీయంగా తగ్గి, పునరుత్పత్తి సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని సూచించారు.

ఇసుక.. మస్కా!





క్యాటిల్‌ఫామ్ వద్ద వక్ఫ్, వెటర్నరీ యూనివర్సిటీ భూముల్లో ఇసుకను తోడుతున్న దృశ్యం, యూనివర్సిటీ భూముల్లో రోడ్డును ఏర్పాటు చేసుకున్న దృశ్యం

- వెటర్నరీ వర్సిటీ భూముల్లో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు
- వక్ఫ్ భూములను వదలని ఇసుకాసురులు
- క్యాటిల్‌ఫాం నుంచి రోజుకు వందలోడ్ల ఇసుక రవాణా
- హైవే పక్కనే ఇసుక తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు

పలమనేరు: కౌండిన్య నదికి ఆనుకొని ఉన్న వక్ఫ్ భూములు, వెటర్నరీ యూనివర్సిటీ, అక్కడి పశు పరిశోధన కేంద్రం లీజుకు తీసుకున్న భూములను ఇసుకాసురులు జేసీబీలతో తవ్వి ఇసుకను యథేచ్ఛగా తరలించేస్తున్నారు. నెలరోజులుగా హైవేకి ఆనుకొని ఈ తంతు సాగుతున్నా ఏ శాఖ అధికారులుగానీ వీరికి అడ్డు చెప్పలేదు. ఈ అక్రమాలపై ఆగ్రహించిన స్థానిక ఎల్‌ఆర్‌ఎస్ (లైవ్‌స్టాక్ రిసెర్చ్ స్టేషన్) సైంటిస్ట్ డా.భారతి పలమనేరు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి, సెబ్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

రోజుకు వంద ట్రాక్టర్ల ఇసుక అక్రమ రవాణా..

కౌండిన్య నదికి ఆనుకుని తూర్పువైపు అటవీశాఖకు చెందిన నగరవనం ఉంది. ఈ భూమిని సైతం ఇసుకాసురులు జేసీబీలతో తవ్వి ఇసుకను తోడేశారు. పడమట వైపున్న సర్వే నంబర్:18,19లోని వక్ఫ్ భూములు, వెటర్నరీ యూనివర్సిటీ లీజుకు తీసుకున్న భూములను సైతం చాలావరకు ఆక్రమించుకొని పైనున్న మట్టిని తీసేసి కిందనున్న ఇసుకను తరలించేశారు. మరోవైపు దక్షిణం వైపు చెన్నై– బెంగళూరు హైవే వంతెన సైతం ఇసుకాసురుల కారణంగా కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. నిత్యం వంద లోడ్లకు పైగా ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు.

రాత్రికి రాత్రే టిప్పర్లలో కర్ణాటకకు...

ఇక్కడ టిప్పర్ ఇసుక రూ.20వేలుగా ఉండగా అదే ఇసుక సరిహద్దు దాటితే రూ.40వేలుగా ఉంది. కూటమి అధికారంలోకి వచ్చాక ఆపార్టీ వారమని చెప్పుకుంటూ పదులసంఖ్యలో అక్రమార్కులు ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. పగలంతా ట్రాక్టర్లతో రహస్య ప్రదేశాల్లో ఇసుకను డంప్ చేయడం ఆపై కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

స్థానికులకు తప్పని బెదిరింపులు..

వక్ఫ్ భూముల్లో ఇసుకను తవ్వరాదంటూ నాగమంగళానికి చెందిన గ్రామస్తులు ఇటీవల కౌండిన్య సమీపంలో సాగుతున్న ఇసుక తవ్వకాలను అడ్డుకున్నారు. దీంతో ఒక్కసారిగా అక్కడున్న ఇసుకాసురులు వారిని బెదిరించినట్టు తెలిసింది. మా చంద్రబాబే చెప్పాడని అధికారులు, పోలీసులే తమ జోలికొచ్చేందుకు భయపడుతుంటే మీరు మాకో లెక్క అని బెదిరించినట్టు తెలిసింది. ఏదేమైనా మరికొన్నాళ్లలో నదికి ఆనుకొని ఉన్న భూములు మొత్తం నాశనం కావడం తథ్యంగా కనిపిస్తోంది.

కన్నెత్తి చూడని అధికారులు..

హైవే పక్కనే ఇసుక దందా ఇంత ఘోరంగా సాగుతున్నా ఇదే మార్గంలో జిల్లా అధికారులు సైతం వాహనాల్లో వెళ్తూ చూసి చూడనట్టు ఎందుకు వెళుతున్నారో అర్థం కావడం లేదు. అటవీశాఖ, మున్సిపల్ వాటర్‌పాయింట్, వక్ఫ్ భూములను నాశనం చేసి ఇసుకను తరలిస్తున్నా ఆయా శాఖలు కనీసం అక్కడికెళ్లి చూడడం లేదు. ఇక ఇసుక అక్రమరవాణాను అడ్డుకోవాల్సిన సెబ్ అధికారులు తమకు సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా హైవేపై గంటకు పది ఇసుక ట్రాక్టర్లు వెళుతున్నా పోలీసులు సైతం నోరు మెదపడం లేదు.

మరీ ఇంత ఘోరమా..



తాము లీజుకు తీసుకున్న భూములను సైతం జేసీబీలు పెట్టి కబ్జా చేసి ఇసుకను తోడేస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకుంటారేమోనని వేచిచూశాం. కానీ ఎవరూ పట్టించుకోలేదు. దీంతో తామే స్థానిక ఆర్డీఓకు ఫిర్యాదు చేశాం. మరీ ఇంత ఘోరంగా ఇసుకను తోడడం నేనెప్పుడు చూడలేదు.

–డా.భారతి, ఎల్‌ఆర్‌ఎస్ సైంటిస్ట్, క్యాటిల్‌ఫాం

సర్వనాశనం చేసేశారు..



నా వయస్సు 70 దాటింది. ఇక్కడ వక్ఫ్ భూముల్లో మట్టిని తవ్వి పెద్ద సొరంగాలు పెట్టి లోనున్న ఇసుకను తోడేస్తున్నారు. దీని గురించి పట్టించుకునే వారే లేరా. ఉదయం పొద్దు పుట్టినప్పటి నుంచి సాయంత్రం దాకా జేసీబీలు, ట్రాక్టర్లు, కూలీలు పనులు చేస్తున్నారు. పక్కనే హైవేపై నుంచి చూస్తే ఇదంతా కనిపిస్తుంది. కనీసం ఏ అధికారైనా వీరిపై చర్యలు తీసుకోవచ్చుగా, ఏం ప్రభుత్వమో ఏమో.

–సయ్యద్ రసూల్, నాగమంగళం

25న అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక

పలమనేరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి అండర్–14 క్రికెట్ జట్టు ఎంపిక ఈనెల 25న పలమనేరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్టు జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడు విజయకుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు హాజరయ్యే క్రీడాకారులు విధిగా బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, క్రికెట్ కిట్‌తో పాటు తెల్లిటి దుస్తులు ధరించి ఎంపికలో పాల్గొనాలని అందులో సూచించారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 7675843101 నంబర్‌ను సంప్రదించాలని అందులో తెలిపారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని తాటిమాకులపాళెంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఈనెల 24న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు చెంగారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ చెన్నై శంకర్‌నేత్రాలయ వారిచే ఉదయం 9 గంటల నుంచి శిబిరం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి శస్త్రచికిత్స, కంటి అద్దాలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా నాగదేవతల ప్రతిష్ట

పుంగనూరు: మండలంలోని సింగిరిగుంట గ్రామంలో గురువారం నాగదేవతల ప్రతిష్ట కార్యక్రమాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. వేకువజామునే వేదపండితులు గణపతి పూజ చేసి, నాగదేవతల ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన భక్తులు హాజరై నాగదేవతలకు పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అనధికారిక లేఔట్లపై కొరడా



అక్రమ లేఔట్‌లో హెచ్చరిక బోర్డు నాటుతున్న మున్సిపల్ సిబ్బంది

పలమనేరు: పట్టణంతోపాటు చుట్టుపక్కలున్న అనధికారిక లేఔట్లపై మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపించారు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం పట్టణపరిధిలోని 36 లేఔట్ల వద్ద ఇది అనధికారిక లేఔట్ అని ఇక్కడ స్థలాలు కొనుగోలు చేయరాదని, ఎవరైనా చేసినా వారికి ఎలాంటి భవన నిర్మాణ అనుమతులివ్వబోమంటూ హెచ్చరిక బోర్డులను నాటారు. ఇక్కడ ఎలాంటి మౌలిక సదుపాయాలను మున్సిపాలిటీ చేయబోదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు వేసిన స్థల యజమానులు, డెవలపర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి హెచ్చరించారు.

వేల్ మురుగన్‌కు హరోహర



వీపునకు కొక్కీలు తగిలించుకుని రథాన్ని లాగుతున్న భక్తుడు

వి.కోట: సుబ్రహ్మణ్యస్వామికి గురువారం భక్తులు వేల్ మురుగన్‌కు హరోహర అంటూ కావళ్లు ఎత్తి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని బసాపురానికి చెందిన పలువురు భక్తులు కావళ్లు ఎత్తుకుని తిరుత్తణికి బయలుదేరారు. ఈ సందర్భంగా బసాపురానికి చెందిన ఓ భక్తుడు తన వీపునకు కొక్కీలు తగిలించుకుని సుబ్రహ్మణ్యస్వామి చిత్రపటం ఉంచిన రథాన్ని లాగి తన భక్తిని చాటుకున్నాడు. ముందుగా పట్టణంలోని బసాపురం వద్ద రథానికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం రథాన్ని వీపునకు కొక్కీలు తగిలించుకుని పట్టణంలోని ఆంజనేయ స్వామి వరకు రథాన్ని లాగుతూ వెళ్లాడు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి కావళ్లతో తిరుత్తణి బయలుదేరి వెళ్లారు.

నేటి నుంచి గ్రామసభలు

పలమనేరు: ఉపాధి పనుల ప్రణాళికలపై నేటి నుంచి మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి ఆయా గ్రామ పంచాయతీల్లో అవసరమైన పనులను గ్రామసభల ద్వారా గుర్తించి వాటిని చేపట్టేందుకు ఈ సభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇక్కడ ఆమోదం పొందిన పనులను ఉపాధి కూలీలు చేసుకోవచ్చునని సూచించారు. ఈ సభలను జయప్రదం చేసేందుకు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలని వీటికయ్యే ఖర్చుల కోసం పంచాయతీలోని జనరల్ ఫండ్స్ నుంచి రూ.వెయ్యి తీసుకోవచ్చునని అందులో సూచించారు. అయితే పంచాయతీలో జరిగే గ్రామసభలకు సంబంధిత సర్పంచులకు విలువ లేకుండా జరుగుతున్న తంతుపై సర్పంచులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: మండలంలోని 23 పంచాయతీల్లో ఉపాధి హామీ ద్వారా చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ శ్రీనివాసులు గురువారం తెలిపారు. గ్రామసభలను ఆయా పంచాయతీలలో నిర్వహించి, పనులను గుర్తించే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గ్రామసభల్లో సూచించిన పనులు ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామసభల్లో ఆప్రాంత వాసులు తప్పక హాజరై ,గ్రామసభలను జయప్రదం చేయాలని కోరారు.

శాంతిపురంలో..

శాంతిపురం: మండలంలోని 23 పంచాయతీలలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు ఉపాధి హామీ ఏపీఓ తుపాకుల హరినాథ్ తెలిపారు. ఆయా గ్రామసభల ద్వారా ఉపాధి కింద చేయాల్సిన పనులపై ప్రతిపాదనలను సిద్ధం చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, మేట్లు, కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, స్వయం సహాయక సిబ్బంది, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

కోల్‌కతా ఘటనపై నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాలు

పలమనేరు: కోలకొతా ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనకు నిరసనగా పట్టణానికి చెందిన ప్రజాసంఘాలు గురువారం నిరసన తెలిపాయి. ఇందులో ఐద్వా, సీఐటీయూ, వ్యవసాయ కార్మికసంఘం, కులవివక్షపోరాట సంఘం, ఆశావర్కర్ల యూనియన్‌లు పాల్గొన్నాయి. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ ఆయా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. వైద్యులకు రక్షణ కల్పించేలా కఠినమైన చట్టాలను తీసుకురావాలన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. ఇందులో నేతలు ఓబుల్‌రాజు, గిరిధర్‌గుప్త, భువనేశ్వరి, ఖైరున్నీసా, సావిత్రి, రాజా, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి కేబుల్ ఏర్పాటు

పుంగనూరు: పలమనేరు నుంచి పుంగనూరు విద్యుత్ సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా అయ్యేందుకు ఆప్టికల్ కేబుల్ ఏర్పాటును శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు ఈఈ శ్రీనివాసమూర్తి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ కేబుల్ ఏర్పాటు కార్యక్రమంలో పుంగనూరు ప్రాంత వాసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా మదనపల్లె నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. ఇందు కోసం ఏర్పాట్లు చేశామన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఏర్పడితే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. కేబుల్ ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఆహ్వానం



ఆహ్వాన పత్రికను ఎంపీపీకి అందిస్తున్న సభ్యులు

వి.కోట: ఈనెల 26వ తేదీ శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని మండలంలోని రామాపురం గ్రామంలో నిర్వహించే శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ప్రబోధ సేవా సమితి సభ్యులు ఎంపీపీ యువరాజుకు ఆహ్వానం పలికారు. గురువారం మండలంలోని చింతమాకులపల్లి గ్రామం ఎంపీపీ నివాసంలో ప్రబోధసేవా సమితీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయన్ను వేడుకలకు ఆహ్వానం పలికారు. ప్రబోధసేవా సమితీ మండల అధ్యక్షులు అశోక్‌బాబు, సభ్యులు పాల్గొన్నారు.

అతిసారం.. ఆందోళనకరం

- అపోలో ఆస్పత్రిలో విద్యార్థుల అవస్థలు
- ప్రస్తుతం చికిత్స పొందుతున్న 112 మంది



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థులు

కాణిపాకం: అతిసారం బారిన అపోలో విద్యార్థులు కొందరు ఇంకా ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. అపోలో విద్యార్థులు అతిసారానికి గురై సొమ్మసిల్లిపడిపోయారు. మూడు రోజులుగా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. 300 మంది విద్యార్థులు ఈ వ్యాధి బారిన పడితే వారికి వైద్యులు, జూనియర్ డాక్టర్లు, విద్యార్థులంతా రాత్రంతా కాపలా కాశారు. ఈ ఫలితంగా కొంత మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే మరికొందరు సురక్షితంగా ఇంటికెళ్లారు. వీరి బాగోగులను అపోలో కాలేజీ నిర్వాహకులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా వైద్య విధాన పరిషత్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, బాధిత విద్యార్థుల ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. నగరంలోని అపోలో కాలేజీలో కలుషిత ఆహారం తిని మంగళవారం రాత్రి అతిసారం విజృంభించిన విషయం తెలిసిందే. బుధవారం ఉదయం నుంచి విద్యార్థులకు వాంతులు, విరేచనాల తీవ్రత అధికమైంది. దీంతో చాలా మంది విద్యార్థులు చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో చేరగా, మరికొందరిని అపోలో కాలేజీలోని చికిత్స అందించారు. 300 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారని విద్యార్థులు చెబుతున్నారు. అయితే అధికారుల లెక్కల ప్రకారం 257 మంది అతిసారం బారిన పడ్డారు. ప్రస్తుతం 112 మంది చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అపోలో కాలేజీలో 25 మందికి చికిత్స అందుతోంది. ఐసీయూలో నలుగురు ఉండగా, ఇందులో ఒకరికి కాస్త రక్తపు వాంతులయ్యాయని చెబుతున్నారు. మరో విద్యార్థికి ఫిట్స్ రావడంతో సీఎంసీకి తీసుకెళ్లారు. ఆమెకు అక్కడ అన్ని రకాల పరీక్షలు చేసి మెరుగైన వైద్యం అందడంతో సురక్షితంగా డిశ్చార్జ్ అయ్యారు. అతిసారం బారిన పడ్డ విద్యార్థుల విషయంలో ఇటు అపోలో యజమాన్యం, అటూ జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌రెడ్డి, అపోలో నిర్వాహకులు నరేష్‌కుమార్‌రెడ్డి వారి బృందంతో కలిసి పర్యవేక్షిస్తూ, విద్యార్థుల ఆరోగ్య వివరాలను ఆరా తీస్తున్నారు.

బాబోయ్ జరిమానాలు

- పోలీసుల జరిమానాతో కుప్పం ప్రజలు బెంబేలు
- వేలల్లో ఫైన్‌లు

కుప్పం: పట్టణంలో ద్విచక్రవాహనం నడుపుతూ పోలీసుల కంటపడితే జరిమానాల మోతా మోగాల్సిందే. జరిమానాలతో పట్టణ ప్రజలు బెంబేలెత్తున్నారు. రెండు నెలలుగా పోలీసులు జరిమానాలు వేలల్లో నమోదు చేస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పట్టణంలో ద్విచక్రవాహనంపై ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌తో దొరికితే పోలీసులు వేలల్లో జరిమానా విధిస్తున్నారు.

రూ.20వేల వరకు జరిమానాలు..

పట్టణంలో ద్విచక్రవాహనంపై ట్రిపుల్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పట్టుబడితే రూ.10 వేల నుంచి 20 వేల వరకు జరమానా వసూలు చేస్తున్నారు. గతంలో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించేందుకు, భయపెట్టేందుకు జరిమానాలు విధిస్తుండేవారు. కాగా ప్రస్తుతం కుప్పంలో ప్రతిరోజూ సాయంకాలం 6 గంటపైనా అధికార బృందం తనఖీలు చేపడుతుంది. ప్రధానంగా కుప్పం నుంచి కృష్ణగిరి బైపాస్ రోడ్డు, హైవే, పట్టణంలోని ప్రధాన కూడలీలో తనఖీలు చేపడతారు. తనఖీల్లో ద్విచక్రవాహదారులు తాగి డ్రైవింగ్ చేస్తే రూ.10వేల పైనే జరిమానా. ట్రిపుల్ రైడింగ చేస్తే రూ.5 వేల నుంచి 10 వేల వరకు జరిమానా విధిస్తారు. పోలీసులు నమోదు చేస్తున్న జరిమానాలకు ప్రజలు బేంబేలెత్తున్నారు. ప్రధానంగా కుప్పం నుంచి నిత్యం బెంగళూరుకు కూలీ పనుల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. వీరందరు సాయంకాలం తిరుగు ప్రయాణంలో కుప్పం చేరుకుని పార్కింగ్ స్థలంలో ఉంచిన వాహనాన్ని తీసుకుని గ్రామాలకు వెళతారు. ప్రతిరోజూ సాయంకాలం 7.45 బెంగళూరు నుంచి కుప్పం వచ్చే పుష్‌పుల్ రైలులో ప్రయాణికులు కుప్పం చేరుకుంటారు. ఇదే సమయంలో పోలీసులు తనఖీల పేరిట కూలీ పనులకు వెళ్లి వచ్చే కూలీలు, సామాన్య ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం కూలీ చేసుకుని వచ్చే వారికి వేలల్లో జరిమానాలు వేసి వాహనాలకు స్వాధీనం చేసుకుని తమ జీవన ఉపాధిపై దెబ్బకొడుతున్నారని కూలీలు సైతం ఆవేదన చెందుతున్నారు..

అంతా ఆన్‌లైన్ పేమెంట్

వాహన తనిఖీల్లో భాగంగా పోలీసులు జరిమానాలు విధించిన వెంటనే అంతా ఆన్‌లైన్‌లో పేమెంట్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. స్థానికంగా ఉన్న ఎవరి మాటను పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినపిస్తున్నాయి. తనిఖీ చేసిన ప్రాంతంలోనే ఆన్‌లైన్‌లో నమోదు చేశాం, జరిమానా కట్టి వాహనాన్ని తీసుకెళ్లాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. దీంతో ఏమి చేయలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు, దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

చిరు వ్యాపారులపై అధికారుల ప్రతాపం





బస్టాండు వద్ద చిరు వ్యాపారులను హెచ్చరిస్తున్న అధికారులు, కడా కార్యాలయం వద్ద తోపుడు బండ్ల దుకాణాలు తొలగిస్తున్న వ్యాపారులు

- రోడ్డుపై దుకాణాలు పెట్టకూడదని హెచ్చరికలు
- మున్సిపల్ కమిషనర్, సీఐ ఆధ్వర్యంలో దుకాణాల తొలగింపు

కుప్పం: మున్సిపల్ పరిధిలో రోడ్డుకు ఇరువైపులు నిర్వహిస్తున్న చిరు దుకాణదారులపై అధికారులు ప్రతాపం చూపించారు. గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు రాజు, అర్బన్ సీఐ జీటీ నాయుడు కలసి పట్టణంలో దుకాణాలు రోడ్డుకు అడ్డంగా నిర్వహించకూడదని హెచ్చరించారు. ప్రధానంగా కడా కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు రోడ్లపై దుకాణాలు పెడితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొన్నేళ్లుగా రోడ్లపై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్నాం, ఇప్పుడు హఠాత్తుగా దుకాణాలు తొలగిస్తే మాకు జీవనాధారం ఎలా అని వ్యాపారస్తులు బతిమలాడినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. కడా కార్యాలయం బయట దుకాణాలను, తోపుడు బండ్లను అక్కడి నుంచి తొలగించాలని అధికారులు ఒత్తిడి చేశారు. పోలీసు యంత్రాగం, మున్సిపల్ సిబ్బంది కలసి దుకాణాలను చుట్టుముట్టడంతో వ్యాపారులు భయభ్రాంతులకు గురయ్యారు. అధికారులకు ఎదురు చెప్పలేక చిల్లర వ్యాపారులు దుకాణాలు ఎత్తివేసి ఇంటిముఖం పట్టారు. తమకు ప్రత్యామ్నయంగా స్థలం కేటాయించి, తరువాత మా దుకాణాలు తొలగించి ఉండాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయం



జూనియర్ కళాశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం పనిచేస్తోందని ఆ సంఘం జిల్లా కన్వీనర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని పలు జూనియర్ కళాశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారానికి పోరాటాలు చేస్తున్నామన్నారు. కూటమి విద్యార్థుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘం నాయకులు మున్నా, బాలాజి పాల్గొన్నారు.